# నా బ్రతుకు నీకు వద్దమ్మా!

"అత్తా!" అని నెమ్మదిగా పిల్చి ఇటూ,అటూ చూసి బియ్యంలో రాళ్లేరుతున్న మేనత్త పక్కన కూర్చున్న గాయత్రిని, ఏదో చెప్పాలని తపనపడుతోందని గ్రహించుకున్న కమలమ్మ "ఏమిటమ్మా?" అంది ఆప్యాయంగా మేనకోడలి తలనిమురుతూ.

"నీతో చాలా ముఖ్యమైన విషయం చెప్పాలత్తా! అమ్మ గుడికి వెళ్లింది. నాన్నగారు షికారుకు వెళ్లారు. ఇంతకంటే మంచి అవకాశం దొరకదు. ఒక్కసారి ఆ పని మాని వినవా?" అంది ప్రాధేయపడుతూ.

"చెమ్మమ్మా చెప్పు. దాని కంటె ఈ పని ముఖ్యం కాదు" అంది కమలమ్మ.

"అది కాదత్తా! మా బ్యాంకులో నాతో పనిచేస్తున్న శంకరంగారు నన్ను పెళ్లి చేసుకుంటా నంటున్నారు. ఆయనకి నా విషయ మంతా చెప్పేను. తన కెట్టి అభ్యంతరం లేదన్నారు. "మీకు ఇష్టమయితే నాకు నిన్ను చేసుకోవడానికి ఏం అభ్యంతరము లేద"ని చెప్పేరు. సింపుల్‌గా మేరేజ్ చేసుకొంటారట. రిజిస్టర్ మేరేజ్ అయినా తనకేం అభ్యంతరం లేదన్నారత్తా! అంటూ ఆశ నింపుకున్న కళ్లతో చెప్పసాగింది గాయత్రి. ఇక – ముందు చెప్పబోయేది తనకు తెలుసు. ఈ సమస్య పరిష్కరించమన్నదే ఆమె ప్రాధేయత, తన అన్నయ్యకి ఈ విషయం చెప్పి వొప్పించమన్నదే ఆమె ఉద్దేశం. కానీ అది అంత చిన్న విషయంకాదు. గాయత్రి ఈవిషయం తనతో చెప్పడానికి కారణం –

గాయత్రీ, కమలమ్మల అనుబంధం, ఆప్యాయత అందరు మేనత్త మేనకోడళ్లవంటిది కాదు. మేనత్తలు మేనకోడళ్లని ముద్దుగా చూడటం అన్నది అరుదు. కానీ గాయత్రికి కన్న తల్లిదండ్రుల కంటే మేనత్త దగ్గరే చనువు ఎక్కువ. దానికి కారణం లేకపోలేదు.

ఈ మేనత్తే తనని ఆదుకొని ఉండకపోతే ఈనాడు తన జీవితం ఈవిధంగా ఉండేది కాదు. సనాతనులైన తన తల్లిదండ్రుల మధ్య తన బతుకూ, తన అత్త బతుకులాగే బూడిద పాలైన పన్నీరు లాగ ఉండేది. కానీ తాను ఈ నాడు బ్యాంకులో

ఉద్యోగం చేస్తూ ఎనిమిది వందలు గడించుకుని, తన కాళ్ళ మీద తాను నిలబడిందంటే అది మేనత్త చలువే అని చెప్పాలి. గతాన్ని తల్చుకుంటే అంతా వింతగా ఉంటుంది.

ఎస్. ఎస్. ఎల్.సి ప్యాసయిన తనకి తండ్రి మధ్యతరగతి కుటుంబీకుని తీసుకొచ్చి వివాహం జరిపించాడు. బి.య్యే. ప్యాసయి ఉద్యోగంలో చేరిన తన భర్త తనని కాపురానికి తీసుకు వెళ్ళిన ఏడాదికే కారు ప్రమాదంలో మరణించాడు. పెళ్ళయిన రెండేళ్ళకే విధవగా తను పుట్టింటికి తిరిగి వచ్చింది. రాత్రింబవళ్ళు తన బాధని దిగమింగుకొని కుమిలి, కుమిలి ఏడ్చేది. తనని చూసి జాలిపడే వారే గానీ, తన బాధని అర్థం చేసుకునే వాళ్ళెవరు? తెల్లవారగానే ఎవరికీ ఎదురుపడకూడదు, నలుగుర్లో కూర్చుని నవ్వకూడదు. శారీరకంగా బతికి వున్నా తను మానసికంగా చనిపోయినట్లే లెక్క. తనకు తోడుగా తన పరిస్థితి లోనే ఉన్న మేనత్త మాత్రం తనని అర్థం చేసుకుని ఓదార్చేది. వయస్సులో తేడా తప్ప ఇద్దరూ ఒకేపడవలో పయనిస్తున్నారు.

ఒక రోజు తండ్రీ, మేనత్తల మధ్య ఘర్షణ ప్రారంభ మయింది. అంతా విన్నాక గానీ అది తన గురించే అన్నది తనకి తెలియలేదు.

"అది కాదన్నయ్యా! దానికి ఎన్నేళ్ళు? ముండమోసిందని దాన్ని అలా ఇంట్లో కుళ్ళబెడితే ఎలాగ? కాలేజీలో చేర్పించన్నయ్యా! దాని కాళ్ళ మీద దాన్ని నిలబడేలా చెయ్యాలి. రేపు దాని గతేమిటి? పెద్దవాళ్లం ఎన్నాళ్లు బతికి వుంటాం? దాన్ని ఎవరు పెంచుతారు? చదివిస్తే దాని కడుపుకు అది సంపాదించుకుంటుంది. ఈ కాలంలో తప్పేమిటి? ఈ వూళ్లో చదివించడం నీకు చిన్నతనమయితే, నేను కాపురం పెట్టి రాజమండ్రిలో చదివిస్తా అన్నయ్యా" అన్నమాటలకు అగ్నిహోత్రావధానిలా ఎగిరి పడుతున్న తండ్రి మాటలకి ఇవతల గదిలో ఉన్న తాను వణికిపోయింది.

"ఏమిటే నీ గోల? నన్ను నలుగుర్లో బ్రతకనియ్యదల్చుకోలేదా? మన వంశంలో ఎక్కడన్నా కాలేజీల్లో మగ పిల్లలతో కలిసి చదవడం ఎరుగుదుమే? అందులో మొగుడు పోయినదాన్ని కాలేజీలో అందరిలో చదివించమంటావా? దాన్ని కాలేజీలో చేర్చిన తర్వాత ఏమన్నా జరిగితే మేము నుయ్యో గొయ్యో చూసుకోవాలా?" అంటూ వేస్తున్న రంకెల్ని పట్టించుకోకుండానే మేనత్త నెమ్మదిగానే అన్నతో వాదిస్తోంది.

ఆఖరికి పట్టువిడవని మేనత్త తనని పొరుగూర్లో కాలేజీలో చేర్పించింది. ఇంటర్ అయ్యేనాటికి తండ్రిలో కాస్త మార్పు రావడం గమనించింది. నిజానికి మార్పు అనేకన్నా సర్దుకొన్నాడంటే సరిపోతుందనుకుంది. తర్వాత నెమ్మదిగా బియ్యే పూర్తి చేసింది. మళ్లీ ఇంటికొచ్చింది. ఈసారి గాయత్రిలోనూ కొంచెం ధైర్యం పుంజుకుంది.

ఆ వూళ్లోనే బ్యాంకులో ఉద్యోగానికి అప్లై చేసింది. తల్లీదండ్రికీ తెలిసి నెత్తీ నోరూ బాదుకున్నారు. నిజానికి దీనికి మేనత్త ప్రోద్బలమే కారణమని చెప్పాలి.

"ఏదో చదువుకున్నా వంటే మేం బతికి వుండగానే ఈ ఉద్యోగం ఏమిటే? మేం చచ్చాక చేసుకో. వీధిలో నలుగుర్లో తలెత్తుకొని తిరగాలా?" అంటూ హంగామా చేశారు. అన్నింటికీ తన తరపున తన్ని మేనత్త సమర్థిస్తుంటే గాయత్రిమీద కోపం కమలమ్మగారి మీదకి మళ్లి ఇద్దర్నీ నానా మాటలు అన్నారు. వాటిని లెక్కచెయ్యని కమలమ్మ మొదటి రోజు ఉద్యోగానికి వెళుతున్న గాయత్రికి అమ్మవారి కుంకుమబొట్టు పెట్టి, దేవుడి మీది పూలు తీసి జడలోపెట్టి స్వయంగా సాగనంపింది. బుగ్గలు నొక్కుకునే ఇరుగుపొరుగుల్ని, నిప్పులు కురిపించే కళ్ళతో చూసే తల్లిదండ్రుల్ని మౌనంగా చూసి బ్యాంకుకి వెళ్ళింది. నిజానికి తనని ఇంతదానిగా చేసింది మేనత్తే. రోజూ లేవగానే దేవుడి కన్నా ముందు మేనత్తకి నమస్కారం చేసి, ఎవరి ఎదుటా పడకూడదనే మేనత్తనే వెళ్ళి పలకరించి తన దైనందిన కార్యక్రమాలని ప్రారంభిస్తుంది.

తన బ్యాంకులోనే పని చేసే శంకరంతో తనకి పరిచయం అయింది. రెండువీధుల అవతలే ఉన్న శంకరం, తనూ రోజూ ఒకే బస్సులో వెళ్ళి, ఒకే బస్సులో వస్తారు.

నెమ్మదిగా ఇద్దరి మధ్యా పరిచయం ప్రేమగా మారింది. శంకరం తనను పెళ్లి చేసుకోమని అడిగిన రోజు గాయత్రి శంకరానికి ఏమీ సమాధానం చెప్పలేక పోయింది.

మర్నాడు మళ్ళీ అడిగిన శంకరానికి తన గురించీ, తన కుటుంబం గురించీ అన్నీ చెప్పింది. ఉన్నత భావాలు గల శంకరం తనకి ఈ మూఢనమ్మకాల మీద విశ్వాసం లేదని, మీ వాళ్ళు ఒప్పుకుంటే నీకు రెండో పెళ్లి అయినా నేను చేసుకొనేటందుకు సిద్ధమే అని చెప్పిన మాటలు విని మనస్సులో ఏవో తియ్యటి కోర్కెలు రేగేయి.

అయిదేళ్ళ క్రితం అనుభవించిన తియ్యదనాన్ని మళ్ళీ నెమరువేసుకుంటూ గాలిలో తేలిపోయింది. కానీ వెంటనే ఇంట్లో తల్లీ, తండ్రీ గుర్తుకు రాగానే "ఇది సాధ్యమా?" అని ఆలోచించ సాగింది. "నాకు కొంచెం గడువు యివ్వండి శంకరంగారూ!" అని ఇంటికి వచ్చిన గాయత్రి, అదను చూసుకుని మేనత్తకి ఈ విషయాలన్నీ చెప్పింది.

"నేను ఆలోచించి టైము చూసి అన్నయ్యతో మాట్లాడతాలే గాయత్రీ!" అన్న మేనత్తకి మనస్సులోనే ధన్యవాదాలు అర్పించుకుని వెళ్ళిపోయింది.

ఈ విషయం గాయత్రిలో కంటే కమలమ్మగారిలోనే పెద్ద తుఫాన్ని లేవ దీసింది. గాయత్రిలో చెలరేగిన ఈ కోరిక సమంజసమయిందేనా? లోకం ఎంతో ముందుకు సాగింది. స్త్రీ జాతిపట్ల సమాజ వైఖరిలో ఎంతోమార్పు వచ్చిందని గర్వపడుతున్నాం.

నిజానికి స్త్రీల అభ్యుదయాన్ని గురించి ఉపన్యాసాలు ఇవ్వడంవల్ల, చట్టాలు రూపొందించడం వల్ల, రచనల వల్ల మారేవారు ఎక్కువగా ఉన్నత భావాలు కలవారే. అభ్యుదయ భావాలు లేని కొన్ని కొన్ని కుటుంబాలలో ఎటువంటి మార్పూ రాలేదు. వారి సనాతన భావాలు బూజుపట్టి అలాగే ఉండిపోయాయి. వాటిని దులుపుకోవాలని ప్రయత్నించరు. ఆ తరంవారిని ఈ తరంవారు ధిక్కరిస్తున్నారు. దాంతో కొన్ని కుటుంబాలలో కలతలు రేగుతున్నాయి. పెద్దలు పూర్తిగా ఎదగలేక, పిన్నలు కిందికి దిగలేక త్రిశంకు స్వర్గంలో వ్రేలాడు తున్నారు. అటు అన్న, వదినలది పూర్వాచారం, ఇటు మేన కోడలిది ఆధునిక యుగం. ఎవరి పద్ధతులు వారికి సమంజసంగా ఉన్నట్లు తోస్తాయి. కానీ పెద్దవాళ్ళకి పిన్నలు భయపడి తమ కోరికల్ని చంపుకొంటారు. పెద్దలు తమ అధికారాల్ని చలాయించుకుంటారు. పిన్నలు తిరగబడితే దాన్ని రౌడీతనాలు అంటారు. అంతేకాని కాలంతోపాటు మార లేక పోతున్నారా పెద్దలు.

నిజానికి గాయత్రిలో ఆ కోరిక పుట్టడంలో తప్పేమిటి? గాయత్రి వయస్సు పిల్లలు పెళ్లి కాని వారు అనేకులున్నారు. చిన్ననాడే పెళ్లి చేసిన గాయత్రికి పదిహేడేళ్ళకే అన్నీ అయిపోయి పుట్టింటికి వచ్చింది. తను ఆనాడు అన్నవదినలతో పోట్లాడి చదివించక పోతే తన గతే గాయత్రికీ పట్టేది. అన్నా వదినలదగ్గర తను వంటలక్క లాగ ఉన్నట్లే. ఈ పిల్లా ఎవరింట్లోనో మగ్గవలసిందే. తనూ అన్నావదినల తరం మనిషే అయినప్పటికీ తను గాయత్రిలో ఈ ఆధునిక యుగపు భావాలతో ఎలా ఏకీభవించ గలుగుతోంది. స్వానుభవమే దీనికి కొంత కారణమేమో!

తనపోలికే గాయత్రికీ వచ్చింది. కానీ గాయత్రి ఏడాది పాటు కాపురం చేసింది. తను ఆ మాత్రం కూడా సంసార జీవితాన్ని రుచిచూడని అభాగిని. పెద్ద మనిషి కాకుండా పెళ్లి చేసిన తనకి ఏడాది తిరక్కుండానే భర్త పోయాడు. అత్తవారింట అడుగుపెట్టని తను "విధవ"ట. పెద్దమనిషి అయ్యేదాకా పుణ్యస్త్రీగా పరిగణించి పువ్వులూ, కాటుకా, బొట్టూ పెట్టుకోనిచ్చారు. పెద్దమనిషి అయిన మర్నాడు తల్లివచ్చి "ఈనాటి లగాయతూ నువ్వు పువ్వులూ కాటుకా, బొట్టూ పెట్టుకోకూడ"దని, చేతినున్న గాజులు సహితం తీసేసి ఓ మూలగా కూర్చోపెట్టి ఏడుస్తూ వెళ్లిపోయింది. అప్పటి తన వయస్సుకి అదేమీ అర్థం కాక అయోమయంగా ఉండేది. నలుగురిలోకీ రానిచ్చేవారు కారు. పేరంటానికి పిల్చేవారు కారు. మొదట్లో అజ్ఞానం వల్ల "ఎందుకు నేను ఇవన్నీ చేయకూడదు?" అని అడిగేది. తల్లి కళ్ల నీళ్లతో నోట్లో పమిట చెంగు కుక్కుకుని ఏడ్చేదే తప్ప జవాబు ఇచ్చేది కాదు. రాను రాను తనకే అన్నీ అర్థమయ్యాయి. అద్దంలో వెల వెల పోయే తన రూపాన్ని చూసుకొని బాధపడేది. భర్త లేని తను ఇక

అలంకరించుకొనే హక్కుని కోల్పోయినా, వైధవ్యం తనలోని యౌవనం పొంగుని దాచలేకపోయేది. సంసార జీవితాన్ని రుచిచూడక పోయినా తనలో ఏవేవో కోరికలు చెలరేగేవి. ముచ్చటైన జంట కనబడగానే ఏదో తియ్యనిబాధ కలిగేది. అన్నావదినల సరసాలు అప్పుడప్పుడు కంట పడినప్పుడు తన జీవితాన్ని తల్చుకొని కుమిలి పోయేది. పక్కవాటాలో అద్దెకున్న రామం తన్ని ఓరకంటితో చూసినప్పుడు ఒళ్ళు గగుర్పొడిచేది. ఏమిటో చెప్పలేని కోరికలూ, బాధా కలిగేవి. తన మనోవేదన చెప్పుకుందామన్నా స్వాతంత్ర్యం లేదు.

ఆ నాడు విధవలకి స్థానం అదే. వారి బాట వేరు. లోకానికీ కాలానికీ జడిసి మనసులోని కోరికల్ని మనసులోనే చంపుకుని బతికింది తను. ఈనాడు గాయత్రితో ఈ ఆధునికయుగపు భావాలతో ఏకీభవించి, ఆమె కోరికల్ని అర్థం చేసుకో గలుగుతోంది. అందుకే తన జీవితంలా కాకూడదని అన్నని ఎదిరించి, ఆమెను చదివించింది. ఉద్యోగంలో చేర్పించి, పాత పద్ధతుల్ని ధిక్కరించి గాయత్రి మొహం కళకళ్లాడేలా కాటుకా, బొట్టూ పెట్టి; గాజులు తొడిగింది. తన వెనక తన బంధువర్గమంతా అనే మాటల్ని లక్ష్యపెట్టలేదు.

గాయత్రిని మగరాయుడిలా తయారు చేసి, తల్లిదండ్రుల మాటల్ని ఖాతరు చెయ్యకుండా పాడు చేసిందని కూసే కూతల్నీ, ఇరుగుపొరుగులు అనే మాటల్ని ఆ చెవిని విని ఈ చెవిని వదిలేసేది. ఒక్కోసారి వదిన కూడా తనని అనరాని మాటలు అనేది. అన్నీ సహించి ఊరుకునేది.

లైటు వేసిన శబ్దానికి ఈలోకంలోకి వచ్చిన కమలమ్మ ఏదో నిశ్చయానికి వచ్చిన దానిలా లేచి తన వంట పనులు చూచుకోవడం ప్రారంభించింది.

మర్నాడు షికారుకని వెళ్లబోతున్న అన్నగార్ని కమలమ్మ వెనక్కి పిల్చింది. ఎందుకో అర్థంకాని రామావధాని ప్రశ్నార్థకంగా చెల్లెలి వైపు చూస్తూ నిల్చున్నాడు.

"అన్నయ్యా! నీతో ఓ విషయం మాట్లాడాలి. ఇవాల్టికి షికారు మాని కూర్చో" అంది, వదిన గుళ్ళోకి వెళ్లిన అదనుచూచి,

"ఏమిటమ్మా ఏమిటి విశేషం?" అన్నాడు ఆత్రుతగా. "అది కాదన్నయ్యా! మన గాయత్రికి పెళ్లి చేస్తే......... ........" అన్న మాటల్ని పూర్తి చెయ్యకుండానే ప్రళయ మొచ్చినంత బీభత్సంగా ఉరిమి "నీకేమన్నా బుద్ధుందా? ఏం మాటాడుతున్నావో తెలుస్తోందా? వంటి మీద స్పృహ వుండే మాట్లాడుతున్నావా? మొగుడు పోయినదాన్ని చదివించమంటే ఏదోసరేనన్నా. అది చాలక మేం బతికి వుండగానే వీధిలోకి పంపి ఉద్యోగం చేయిస్తున్నావు. దానికి మొగుడులేదని తెలిసుండి గూడా మీ అమ్మాయికి పెళ్లిచెయ్యరా? అంటున్నారు కొందరు వెటకారంగా. ఇన్నీ భరించి బతుకుతుంటే,

ఇహ చేసింది చాలక పెళ్ళి కూడా చెయ్యమంటున్నావు? నీచేత్తో నాపీక నరికి దానికి నువ్వే ఆ పెళ్లి చెయ్యి. అయినా దాన్ని చేసుకొనేదెవరే?" అన్నాడు పళ్లు పటపటలాడిస్తూ.

చివరిమాటలు కాస్త ధైర్యాన్ని కలిగించిన కమలమ్మ అన్నగారి మీదకి ఖస్సున లేచింది. "అయితే చేసుకొనే వాడుంటే ఇస్తావా? అయినా పెళ్లిచేస్తే తప్పేమిటి? గాయత్రి వయస్సు పిల్లలకీనాడు పెళ్లిళ్లే కావటంలేదు. గాయత్రి మగపిల్ల వాడయితే మళ్లీ ఏడాది తిరక్కుండా పెళ్లి చేసేవాడివా లేదా? ఒక్కసారి వెనక్కి తిరిగి ఆలోచించు అన్నయ్యా! ఒకే ఇంట్లో, ఒకే రక్తం పంచుకుని పుట్టిన మనిద్దరిలో ఎంత భేదమో చూడు? ఆడపిల్లగా పుట్టినంత మాత్రాన నాకు భర్త పోగానే అలంకరణలన్నీ పీకి పారేసి ఓమూల కూర్చోబెట్టారు. అదే జాగాలో భార్యపోయిన నిన్ను మళ్లీ పెళ్లికొడుకుని చేసి అన్ని ముద్దుముచ్చట్లతో మళ్లీ పెళ్ళి చేశారు. మొదట ఒక పెళ్ళి అయిందన్న సంగతే మర్చిపోయి మళ్ళీ కార్యం పెళ్ళి కొడుకువయ్యావు. ఆనాడు నాలో కలిగిన అనేక కోరికల్ని నాలోనే చంపుకున్నాను. ఈ గాజులూ, పువ్వులూ, బొట్టూ, కాటుకా, భర్తతోటే వచ్చాయా? ఆకలిని చంపుకోలేని మనం కోర్కెల్ని భర్త పోయినంత మాత్రాన చంపేసుకోగలమా? నోటికోరకం రుచి, మనిషికోరకం భావం కోరికా ఉంటాయి. లోకం కోసం జడిసి అన్నింటినీ చంపుకోవలసిందేనా? ఎందుకు చంపుకోవాలి. ఈ నాడు గాయత్రిని వెటకారమాడుతున్న వ్యక్తులు రేపు దాన్ని పోషిస్తారా? ఈ వెటకారమాడే పెద్దమనుషులే గాయత్రివెంటపడి ఆమెని ఓ వూపు వూపి చూస్తున్నారన్న సంగతి తెలుసుకో. పెళ్ళి అన్నది స్త్రీకి ఓ అండ అన్నది గుర్తుంచుకో. ఇంతకీ గాయత్రిని చేసుకోడానికి వప్పుకొని ముందుకొచ్చాడు గాయత్రి బ్యాంకులోనే ఉద్యోగం చేస్తున్న ఒక అబ్బాయి. రాత్రికి నువ్వూ, వదినా బాగా ఆలోచించుకుని ఏదో నిశ్చయించి చెప్పేయండి. మీరు ఒప్పుకోకపోతే నేను పెద్దగానిల్చి వాళ్ళిద్దరికీ వివాహం జరిపిస్తా. నాలా అభాగినిలా బతకనివ్వను. నాలాంటి దుర్భర జీవితం నా పుట్టింటి ఆడపిల్ల ఇక అనుభవించడానికి వీల్లేదు" అని దుఃఖాన్ని ఆపుకోలేక వంటింట్లోకి వెళ్ళిపోయింది వెక్కి వెక్కి ఏడుస్తూ.

ఇన్నాళ్ళూ చెల్లెలి మనస్సులో అణగి ఉన్న ఆవేదనని అర్థం చేసుకో లేక పోయిన రామావధాని కమలమ్మ మాటలతో నిశ్చేష్టుడై కూలబడి పోయాడు. "నిజమే తనకీ, తన చెల్లెలికీ మధ్య తేడా ఏమిటి? తన తల్లిదండ్రులు మూర్ఖంగా ఆమెని విధవని విధవ గానే వుంచి, తనని కొత్త పెళ్లి కొడుకుని చేశారు. వారికెందుకాదౌర్భాగ్య జీవితం? తమ కెందుకీ కొత్త బాట? "లోకం పోకడ" లోకం – లోకం – లోకం అంటే ఎవరు? మనమే – మనం ఈ నాడు ఒకర్ని అంటున్నాం, మర్నాడు వాళ్లు

మనని అంటున్నారు. ఆనాడు మా తల్లిదండ్రులు నాచెల్లెల్ని విధవని చేసారు. ఈనాడు తనూ తన కూతుర్ని అదే చెయ్యాలనుకుంటున్నాడు. కానీ ఆ నాటి తన బాధ నంతా దిగ మింగుకుని, తనలా ఎదుటి వాళ్లు బాధ పడడం సహించలేని తన చెల్లెల్ని తను అర్థం చేసుకోలేక పోయాడు. ఇన్నాళ్లూ గాయత్రి పట్ల ఆమె చేసిన ప్రతిపనీ తను అయిష్టంగానే జరగ నిచ్చేవాడు కానీ ఇకముందు తను అలా చేయడు. గాయత్రికి తన చేత్తోటే అక్షింతలు వేసి మాంగల్యం కట్టిస్తాడు."

"ఏమిటండీ ! చీకట్లో అలా కూర్చున్నారూ!" అన్న భార్య పలుకరింపుతో ఈ లోకంలోకి వచ్చిన రామావధాని మేడ మీద గదిలో బిత్తరపోయి కూర్చున్న గాయత్రి దగ్గరికి వెళ్ళి శంకరం వివరాలు అడగడంతో ఆమె దిగ్భ్రాంతి చెందింది. "మా నాన్నేనా ఇలా మారిపోయాడు" అనుకొని భయంపోని గాయత్రి తండ్రి వొడిలో వాలిపోయింది. "ఇన్నాళ్లు చేసిన తప్పు ఇక చేయనమ్మా! మీ ఇద్దరి పెళ్లి నా చేతుల్తో చేస్తాను తల్లీ!" అని గాయత్రిని ఓదార్చి, శంకరం ఇంటికి బయలుదేరాడు రామావధాని.

ఆనందం పట్టలేని గాయత్రి అత్తని చుట్టేసుకొని తండ్రిలోని ప్రవర్తనని చెప్పేసరికి "నాన్న మారతాడని తెలుసమ్మా. నాన్నకి నీమీద ప్రేమలేక కాదు. లోకానికి భయపడే వ్యక్తి అంతే - నాలాంటి బ్రతుకు నీకొద్దమ్మా!" అని తల నిమిరింది మేనత్త. ఏమీ అర్థంకాని వదిన వీరిద్దరి చేష్టల్నీ మాటల్నీ వింతగా చూడసాగింది.

ముహూర్తం నిశ్చయించారు. పెళ్లి పనులు సాగుతున్నాయి. ఎవరికి తోచినట్లు వారు విమర్శిస్తున్నారు.

"ఇదేం పొయ్యేకాలం ఈ అవధానికి" అని కొందరంటే, మరి కొందరు బంధువులు రానన్నారు. ఎవర్నీ పట్టించుకోని రామావధాని ఆ దంపతుల స్నేహితుల సాన్నిధ్యంలోను, ఆధునిక భావాలుకలిగిన పెద్దల సమక్షంలోనూ వారిద్దరి వివాహం జరిపించాడు.

పీటలమీద నుంచి లేచి రామావధాని గారి పాదాలకి నమస్కరించ బోతున్న గాయత్రీ శంకరాలని చెరో చేత్తో పొదివి పట్టుకొని "నాకు కాదమ్మా! దేవతవంటి మీ అత్తకి ముందు నమస్కరించండి. మీకీ కొత్త బాటని ప్రసాదించిన దైవం ఆవిడే అన్నాడు" ఆనందంగా.

తన బాధ్యతని నెరవేర్చుకున్న కమలమ్మ వారిద్దరినీ చూసి తృప్తిగా నిట్టూర్చింది.

మహిళ మాసపత్రిక

జనవరి 1979